# పెళ్ళికూతురు

గోమేధ

పెళ్ళి చూపులు ముగిశాయి. గ్రాఫ్ పటంలో రెండు గీతలను పొడిగించగా, పొడిగించగా - ఒక చోట కలుసుకున్న గ్రాఫ్ పాయింట్‌లా ఇరువైపుల పెద్దల సంభాషణలు, షరతులు ఒక చోట కలుసుకున్నాయి. దాంతో ఒక పెద్ద కార్యం తీరింది. ఇక మిగిలింది వధూవరుల పరస్పర అంగీకారం.

పెళ్ళికూతురు బాహాటంగా అభిప్రాయాన్ని వెలిబుచ్చే స్వేచ్ఛ లేని దేశం కాబట్టి, ఇక ముఖ్యమైనది పెళ్ళికొడుకు అంగీకారం.

అంటే నా అంగీకారం అన్నమాట. ఇంత మంది నా అభిప్రాయం కోసం ఎదురుచూస్తూ ఉన్నప్పుడు, నా పింకోర్ట్ బడ్డి కళ వాలో వచ్చిందేమో కాని, నాలో చెలరేగుతున్న భావ సంఘర్షణలో నేను మునిగి ఉన్నాను.

ఆఖరు సారిగా ఆ అమ్మాయి వంక మరొక్కసారి పరీక్షగా చూశాను. చలి దేశం కాకపోయినా బెనారస్ చీర శరీరానికి నిండుగా కప్పుకుంది. కష్ట పడి నున్నగా తల దువ్వింది. నీటైనా తారు రోడ్డులా ముచ్చటైన పెద్ద కళ్ళ అందం చెరగొడుతూ దట్టంగా కాటుక పులిమింది. జానపద కాలం నాటి అంతఃపురాలను ప్రతిఫలిస్తూ ఒంటి నిండా ఆభరణాలు ధరించింది. ఏ మొహాలు నేను చూసేది ఏమిటిలే అన్నట్టు ముడగ తీసుకుని తల వంచి భూమికి సమాంతరంగా చూపు నిలిపింది. అంతే ... ఇంతవరకు నా ఊహల్లో విహరించే రూపానికి ... ఎదురుగా కూర్చున్న ఈ రూపానికి, ఏ మాత్రం పొత్తు కుదరక పోవడంతో నేను నాలుక చప్పరించాను. నా చప్పరింపుతో మా వాళ్ళు సంగతి గ్రహించేశారు.

"సరే లెండి, ఊళ్ళో పనేనాయె, ఇంటికి వెళ్ళి మా అభిప్రాయం తెలుపుతాం" అని లేచారు మా వాళ్ళంతా. ఆ మాట అనటంతోనే దాని తాత్పర్యం కొంత అవగాహనమై పోయింది అవతలి వాళ్ళకు. అయినా ఆశ చావక ... "ఆలోచించి త్వరగా శుభవార్త పంపండి బావగారు" అని సాగనంపాడు ఆ ఆడ పిల్ల తండ్రి.

ఇక యింటికి చేరటం ఆలస్యం... అంతా ఒక్కసారిగ విరుచుకు పడ్డారు నా మీద.

"ఏరా నీ అభిప్రాయం చెప్పమంటే

అలో గుటకలు మింగుతావే పిల్ల బాగో లేదా" నిలదీసి అడిగారు నాన్న.

"లక్షణంగా లక్ష్మీ కళ ఉట్టిపడుతూ ఎంత వినయంగా సమాధానాలు చెప్పిందనుకున్నావు. చాలా నిదానస్తురాలు, బుద్ధిమంతురాలుగ కనపడుతుందిరా. ఆ పిల్ల బాగోలేదటరా నీకు" అంది అమ్మ.

"ఏరా నాయనా! ఈ మాటా ప్రతి కుంతగా నాలుగు అక్షింతలు వేసుకోవేమిట్రా. ఆ పిల్లకు కన్ను వంకరా, కాలు వంకరా. ఆ పిల్లకు ఏం తక్కువరా సీతమ్మ తల్లిలా ఉంది" అని అందుకుంది అరవయ్యేపడిలో పడిన బామ్మ.

"ఆ అమ్మాయి చాలా తెలుపు దోసతనం వున్న దానిలా వుందిరా అన్నయ్య, చదువుకుంది కూడాను, మరి నీకు ఎందుకు నచ్చలేదో కాని" చెల్లి అంది

"మంచి సాంప్రదాయమైన కుటుంబం చెప్పుకోదగిన ఆస్తి, అదీ గాక ఏకైక సంతానం, ఏం తక్కువ ఈ సంబంధానికి" అని అడిగాడు మామయ్య.

నాకు ఒక్కసారిగా చిర్రెత్తింది. "ఆ పిల్ల బాగోలేదని ఎవరన్నారు. అమ్మ అన్నట్లు అపర లక్ష్మీదేవి, బామ్మ అన్నట్లు అపర సీతమ్మే. మామయ్య అన్నట్లు చెప్పుకోదగ్గ ఆస్తి, అన్నీ బాగానే ఉన్నాయి అయితే నాకుమాత్రం ఆ పిల్ల నచ్చలేదు" అని చెప్పేసి నా గదిలోకి వెళ్ళిపోయాను.

"ఏమిటో ఈ పిదప కాలం. కాలం చేసి ఏ పుణ్యలోకాన ఉన్నారో కాని ఆ మహానుభావుడు నన్ను చూశారు. నేను ఆయన్ని చూశానా. పెళ్ళి జరిగే వరకు ఆయనెలా ఉంటారో నాకు తెలియదు, నేనెలా ఉంటానో ఆయనకు తెలియదు అన్నీ పిన్నపెత్తనాలు వచ్చాయి ఈ కాలంలో" అని బామ్మ సణుగుతోంది తిరిగి దొడ్లోకెళ్తూ.

"ఒక వారం రోజులలో ఏ సంగతి తేల్చుతామని కబురు పెడతాను వాళ్ళకు ఈ లోగా మరోసారి ఆలోచించి చెప్పు" అని టైమ్ ఇచ్చారు నాన్న.

ఎంత టైమ్ ఇచ్చినప్పటికీ ఏమాలోచించను. ఊహల్లో ప్రతిష్ఠించుకున్న రూపానికి. నా ముందుకూర్చున్న ఆ రూపానికి సంబంధం లేనప్పుడు. జీవితంలో ఒకే ఒకపెళ్ళి చూపు చూడాలి, ఆ పెళ్ళి నిశ్చయమై భావికి తోడుకావాలి అని ఎంతో ఆశగా వుండేది. వరుసగా లెక్కపెడుతూ ఒకరి తరువాత మరొకరిని షాపింగ్ చేసినట్టు పెళ్ళి చూపులు చూడటమంటే అసహ్యం నాకు అయితే నేననుకున్నదానికి విరుద్ధంగా ఇలా మొదటిపెళ్ళి చూపు మనసుకు నచ్చనిదయ్యేసరికి కొంచెం బాధ కలిగింది. రెండు రోజులు గడిచాయి.

ఆరోజు సాయంత్రం అలా బీచ్ కి వెళ్ళాను. మనిషి కోరికల్లాంటి కెరటాలు ముందుకు ఉవ్వెత్తున ఉరకలు వేస్తున్నాయి. చాలా తీరని కోరికలలానే వెనక్కి వెళ్ళిపోతున్నాయి; జ్ఞాపకాల్లాంటి తెల్లని నురగలు విడుస్తూ. ఇంతలో ఒక తెల్లటి కుక్కపిల్ల నా దగ్గరకొచ్చింది మెడలో పూసలదండతో ముచ్చటగావున్న ఆ కుక్క పిల్లను ఎందుకో దగ్గరగా తీసుకోవాలనిపించింది. వంగి చేతుల్లోకి తీసుకున్నాను. ఆ కుక్కపిల్లను ఎక్కడో చూసినట్లుగా

అనిపించింది.

ఇంతలో "మోనీ" అన్న తియ్యని పిలుపు వినిపించి ప్రక్కకు తిరిగి చూశాను ఒక అందమైన యువతి దగ్గరకొస్తోంది ఇసుకలో కూరుకుపోతున్న పాదాలను పైకితీస్తూ అదో మాదిరిగా ఊగుతూ నడుస్తున్న ఆమెను పరీక్షగా చూశాను

నల్లటి బెల్‌బాటమ్ ప్యాంట్, దాని మీద తెల్లటి షర్టు, మెడలో సన్నటి ముత్యాల చైను, వంకీలుగా మడచి వదులుగా రిబ్బనుతో కట్టిన శిరోజాలు - అలా నాజూకైన అందంతో నావైపుకు వస్తున్న ఆమెను అలాగే చూస్తు ఉండిపోయాను. ఆమె అచ్చం నా ఊహల్లో మెదిలే స్వరూపంలా ఉండటంతో అనిర్వచనీయమైన ఆనందం కలిగింది ఆ క్షణంలో. ఇంతలో నా చేతిలోని కుక్కపిల్ల ఆమెవైపు దుమికింది.

"నేనక్కడ కూర్చుని ఇసుక గూళ్ళు కడుతోంటే, మా 'మోనీ' ఎటువెళ్ళిందో కనిపించలేదు. ఇది మీవద్దకు చేరిందన్నమాట" అన్నది ఆమె తన గుండ్రటి నేత్రాలను విప్పార్చి నావంక చూస్తూ.

"మోనీ మంచిపనే చేసింది. అది అలా నాదగ్గరకు రాకపోతే ఈ ముగ్ధ మోహన రూపాన్ని చూసే అదృష్టం నాకు కలిగేది కాదుగా" ఆమె ఏమీ మాట్లాడలేదు చిన్నగా నవ్వింది రోజాల వంటి తన బుగ్గలమీద కెంపులను మెరిపిస్తూ.

"ఇక నేను వెళతానండి గుడ్‌నైట్" అని ముందుకు సాగిపోయింది ఆమె సముద్రంలో అస్తమించబోతున్న సూర్యుడు నీటిమట్టానికి అర్ధగజం పైన ఉన్నప్పటికి నా చుట్టూ ఒక్కసారి చీకటి ఆవరించింది ఆమె నిష్క్రమణతో.

నిర్లిప్తంగా ఇంటికి చేరుకున్నాను. నాముందు నుండి ఆ రూపం అదృశ్యమైనప్పటికి, నాకళ్ళల్లో ఎంతో దగ్గరగా మెరుస్తూనే వుంది.

నా పెళ్ళి చూపుల్లో ఆ అందాలరాశిని ఊహించుకుంటూ, ఆ తలంపుతో కాలంగడిపి. ఆ మర్నాడు సాయంత్రం సముద్రపుతీరానికి చేరుకున్నాను. ఆశ్చర్యం! ఆమె కూడ అక్కడేవుంది. తన కుక్కపిల్లను వడిలో కూర్చోబెట్టుకుని కూర్చుంది నేను వెళ్ళి ఆమె ప్రక్కగా ఎడంగా కూర్చున్నాను.

"ఓ! మీరా" అని చిన్నగా పలకరించింది. ఆమెనన్ను గుర్తుపెట్టుకుందన గానే నా మనసు ఎగిరి గంతేసింది.

నేను చిన్నగా నవ్వుతూ "మీ పేరు చెప్పారు కాదు" అన్నాను "లత" అంది ఆమె నవ్వుతూ.

"రోజూమీరు సాయంత్రం ఇక్కడికే వస్తారా" అని అడిగాను

"అవునండి మా 'మోనీ' నేను రోజు ఇక్కడికే షికారుకొస్తాము," "అయినా ఇంకా ఎంతకాలం వస్తాంలేండి"

"అదేమిటి అలా అంటున్నారు" అన్నాను కొంచెం గాభరాగా.

"ఏముందండి నాకు త్వరలోనే పెళ్ళి అవుతుంది. ఇక ఆతరువాత శ్రీవారి సేవతోనే కాలంగడచిపోతుంది. ఇలా షికార్లు ఎలా కుదురుతాయి చెప్పండి" అంది నిరాశగా భావిజీవితానికి సంబంధించిన భావాలు కొన్ని అర్థంకాని

కాషలో ఇసుక మీద గీస్తూ.

"అయితే మీకు పెళ్ళి నిశ్చయమై పోయిందన్న మాట" అన్నాను నా ఆస్తంతా పోయిందన్నంత దిగులుగా.

"లేదండి. పెళ్ళి చూపులు మాత్రం జరిగాయి. కొద్దిరోజులలో అవతల నుండి అంగీకారం రావటంతో పెళ్ళినిశ్చయమై పోతుంది."

"అదేమిటండి ఇంకా అంగీకారం ఏమిటి? పెళ్ళి సంప్రదింపులలో ఏమన్నా తేడాలు వచ్చాయా?"

"అబ్బె అదేమిలేదండి. వారు అందే కాబోయే శ్రీవారు కొద్దిగా ఆలోచనలో పడ్డారగి విన్నాం" అంది కొద్దిగా సిగ్గు పడుతూ

"ఏమన్నారు, పెళ్ళి కొడుకు మీ గురించి ఆలోచనలో పడ్డాడు-మీకు కోపం రాకపోతే- ఎవరైనా సరే మీ అందం గురించి ఆలోచనలో పడ్డారంటే పరమ మూర్ఖులనుకోవాలి కదండి. అందం అంటే అసలు ఏమిటో తెలియని దుర దృష్ట వంతులనుకోవాలి. నూటికొక్కరు మీ లాంటి అందం గల వాళ్ళు ఉంటేది" అన్నాను.

"అయితే నేను అంతంగానే ఉన్నా నంటారు" అంది ఆమె

"ఎంత మాటన్నారు. సూర్యుడిలో వెలుగుండా అంటారా" అన్నాను.

చీకటి పడతోంది ఇద్దరంతేవాం. ఆమె ఒకవైపు నేనొకవైపు చీలి, తిన్నగా ఇంటికి చేరుకున్నాను ఎప్పుడు దేవుడి గురించి ఆలోచించనివాడ్ని కాకపోయినా, ఈ రోజు తిన్నగా బొమ్మ పూజా మందిరంలోకివెళ్ళి వెంకటేశ్వరస్వామి పటానికి ఎదురుగా నమస్కారంచేసి- "స్వామీ! ఆ సుందర మోహన రూపాన్ని నాకు ప్రసాదించు. లేకను పెళ్ళిచూపులు చూపిన ఆ మూర్ఖుడి మూర్ఖత్వాన్ని మరింత పెంపచేసి, ఆమెను తిరస్కరింపచేసేటట్లు చెయ్యి" అని మొక్కుకున్నాను.

• • •

ఆ మర్నాడు సాయంత్రం బీచ్ కు చేరుకున్నాను. బహుశ నా తొందరలో ముందు చేరుకున్నానేమో! ఆమె ఇంకా రాలేదు. అలా కాసేపటికి వెలుగులా ప్రవేశించింది ఆమె తన సహజమైన చిరు నవ్వు లొలికిస్తూ.


"ఈ రోజు నా కంటే మీరు ముందు వచ్చారే అయితే మీకో శుభవార్త" నన్ను సమీపిస్తూ అంది.

నేను నోరు విప్పేలోపలే నా వంక చూస్తూ-"నా వివాహం నిశ్చయమైంది. వారు తమ అంగీకారాన్ని తెలిపారు" అంది.

అంతే! ఎదురుగా సముద్రంలోని కొండ బద్దలయినట్లయింది. ఆకాశ మంతెత్తు కెరటాలు నన్ను ముంచేసి నట్లయింది నీరసంగా ఇసుకమీద కూల బడ్డాను

"ఏమిటలా ఉన్నారు" ముసి ముసి నవ్వులు నవ్వుతూ అడిగింది ఆమె "అబ్బె ఏమి లేదండి, కొద్దిగా తలపోటుగా వుంది" గొంతు పెగుల్చుకొని అన్నాను ఆమె అదో విధంగా నవ్వుతూ తలవంచుకొని ఇసుకగూళ్ళు కడుతోంది.

నా మీద నాకే జాలివేసింది. అంద తోతున్న అమృత భాండం తిరగబడి




నట్లయింది పిచ్చిగా జుట్టు పీకున్నాను. ఆమె కీ గంట నన్ను చూస్తూ నవ్వుకోవటం గమనించినా అది పట్టించుకొనే స్థితిలో లేను కాసేపటికి నీరసంగా నేనే "మీ వివాహానికి తప్పక వస్తానండి, మీరు పిలిచినా, పిలవకపోయినా మిమ్మల్ని చేపట్టిన ఆ అదృష్టవంతుడ్ని చూస్తానికైనా" అని అన్నాను

"తప్పకుండా రండి. మహారాణి పేటలో ఆడిటర్ కుటుంబరావుగారి ఇల్లు ఎవరి నడిగినా చెబుతారు. వారి అమ్మాయినే నేను" నా కళ్ళల్లోకి చూస్తూ అంది.

"ఆ"! ఒక్కసారి ఉలిక్కిపడ్డాను నేను". ఏమండి సంతమలుపులో గులాబి రంగు మేడేనా మీది" అన్నాను.

"అవునండి" నవ్వుతూ అంది

"అయితే మీ పేరు లక్ష్మి లత గారు కదూ, మిమ్మల్ని చూడటానికి వచ్చింది ప్లీడరు జగన్నాధంగారి అబ్బాయి మురళీ ధర్ కదూ" అన్నాను ఆదుర్దాగా.

"అవునండి" అంది ఆమె.

"అయితే ఆ మురళీధర్ని నేనేనండి" అన్నాను ఆనందంతో. నన్ను గుర్తు పట్టరా !

"మీ మగవాళ్ళకి ఒక జబ్బు వుంది. రోడ్డుమీదకోయి ఏ అందాన్ని చూసినా ఏదో ఒక కోణంలో ఒక వింత అందం కనిపిస్తుంది. అదే ఆడది అర్ధాంగిగా మీ ముందు తలవంచుకొని కూర్చుంటేమాత్రం ఆమెలో ఏ అందం మీ కళ్ళకు కనిపించదు" అని చురుక్కున వెను దిరిగి వెళ్ళి పోయింది నేనూ ఆమెను అనుసరించ బోయి గిరుక్కున వెనక్కి తిరిగి పరి గెత్తాను- ఇంటికి "నాన్నా! నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను" అని చెప్పటానికి. ●●